జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761

గురువారం | 24-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 791 పేజీలు: 4 వెల: రూ.7





# కళింగపట్నం తీరాన్ని తాకిన.. అర్నాబ్

- జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన వర్షం
- గాలులకు పలుచోట్ల నేలకొరిగిన చెట్లు, స్తంభాలు
- ఉప్పొంగిన వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్రతనయ నదులు
- ముంపులో పంటపొలాలు
- అప్రమత్తమైన పోలీసు, రెవెన్యూ అధికారులు
- నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు
- పునరావాస కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, అధికారులు

శ్రీకాకుళం/సంతబొమ్మాళి, సెప్టెంబర్ 23 (వార్త): అర్నాబ్ తుఫాన్ కళింగపట్నం వద్ద తీరాన్ని తాకింది. తీవ్ర వాయుగుండం గంటకు ఐదు కిలోమీటర్ల వేగంతో పయనిస్తూ తీరాన్ని తాకడంతో సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగసిపడింది. ఈ సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్రతనయ నదులతో పాటు గెడ్డలు ఉప్పొంగుతున్నాయి. గాలులకు పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పంటపొలాలు ముంపుబారిన పడ్డాయి. పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు గురువారం కూడా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ సెలవు ప్రకటించారు. జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తీవ్ర వాయుగుండం ముప్పు నేపథ్యంలో జిల్లాలోని తీరప్రాంత మండలాల అధికారులు,క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ ఆదేశించారు. ఎచ్చెర్ల, రణస్థలం, గార, పోలాకి, సంతబొమ్మాళి మండలాల ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసు, వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. రేకుల ఇళ్లు, కచ్చా ఇళ్లలో నివసిస్తున్న ప్రజలను తక్షణమే పునరావాస కేంద్రాలకు గానీ, లేదా వారి సమీప బంధువుల సురక్షిత గృహాలకు గానీ తరలించాలన్నారు. విద్యుత్, ఇతర అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడితే సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలని ఆదేశించారు. పరిస్థితి చేయిదాటితే వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు నివేదించాలని, తక్షణమే ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించుతామని తెలిపారు.




తుఫాన్ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంతబొమ్మాళి మండలంలోని ఉమిలాడ, కారిపేటలోని పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడి వసతులు, ఆహారం, తాగునీరు, వైద్య సేవలు తదితర ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

జిల్లా పోలీసులు తక్షణ సహాయక చర్యలు

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై తక్షణ సహాయక చర్యలు చేపడుతోంది. వర్షాల కారణంగా బుధవారం పలుచోట్ల చెట్లు, కొమ్మలు రహదారులపై కూలిపడినట్లు గుర్తించిన పోలీసులు వెంటనే స్పందించి రహదారులను శుభ్రం చేస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-112కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.



### ముంపులో పంటపొలాలు

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. పలు గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. సంతబొమ్మాళి మండలంలోని కొల్లిపాడు, మరువాడ, లక్కివలస, మేఘవరం, నౌపడ, పోతునాయుడుపేట, వడ్డితాండ్ర తదితర గ్రామాల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాశీపురం గ్రామానికి వెళ్లే రహదారిపై వరదనీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శెలగపేట వద్ద చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు గంటల తరబడి అంతరాయం ఏర్పడింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### వంశధార, నాగావళికి వరద

హిరమండలం: వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం పెరిగింది. బుధవారం గొట్టాబ్యారేజి 8 గేట్లను 20 సెంటిమీటర్లలో 11 గేట్లను 40 సెంటిమీటర్లలో ఎత్తులో ఎత్తి 19వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. వంశధార నదిలోకి 17,598 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా,వచ్చిన నీటిని దిగువకు విడిచిపెడుతున్నట్లు గొట్టాబ్యారేజి కంట్రోల్ కార్యాలయ సంబంధిత అధికారులు తెలిపారు. కుడి,ఎడమ ప్రధాన కాలువల ద్వారా నీటిని నిలుపుదల చేసినట్లు వారు తెలిపారు.

# పట్టాలపై.. మరణ మృదంగం



- టెక్కలి రావివలస వద్ద ఐదుగురిని ఢీకొట్టిన రాజారాణి ఎక్స్‌ప్రెస్ రైలు
- నలుగురు దుర్మరణం, ఒకరికి తీవ్ర గాయాలు
- వీరంతా టెక్కలి హాస్టల్ విద్యార్థులు
- డమర, చిన్నభీంపురం గ్రామాల్లో విషాదం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు
- ఘటన ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ, ఆర్డీవో

టెక్కలి/సంతబొమ్మాళి, సెప్టెంబర్ 23 (వార్త): టెక్కలి సమీపంలోని రావివలస జంక్షన్-బర్మా కాలనీ వద్ద రైలు ఢీకొని మండలంలోని డమర గ్రామానికి చెందిన జన్ని దిలీప్(16), గంగువాడ విశాఖరావు(16), మేఘవరం పంచాయతీ చిన్నభీంపురం గ్రామానికి చెందిన జన్ని శరత్(16), మెళియాపుట్టికి చెందిన సవర శివ(16) అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనలో డమర గ్రామానికి చెందిన జన్ని సాల్మన్‌రాజుకి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. సాల్మాన్‌రాజు మినహా మిగిలిన నలుగురు విద్యార్థులు టెక్కలి ఎస్టీ బాలుర వసతి గృహంలో ఉంటున్నారు. తుఫాన్ కారణంగా కళాశాలకు సెలవు ప్రకటించడంతో బుధవారం వీరంతా చేపల వేట కోసం రావివలస జంక్షన్-బర్మా కాలనీ చెరువు వద్దకు వెళ్లారు. ఆ తర్వాత రైలు పట్టాలపై తిరిగి వస్తుండగా రాజ్యారాణి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో నలుగురు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వీరు ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని, గొడుగులు వేసుకుని ఉండడం, అదే సమయంలో జోరుగా వర్షం కురుస్తుండడంతో రైలు వచ్చిన విషయం గమనించక ప్రమాదానికి గురయ్యారు. అయితే బహిర్భుమికి రైలు పట్టాలపైకి వెళ్లి వస్తుండగా ప్రమాదానికి గురయ్యామని సాల్మన్‌రాజు చెబుతున్నారు. మృతదేహాలను టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు, స్నేహితులు, విద్యార్థులు ఆసుపత్రికి పెద్దఎత్తున చేరుకున్నారు. దీంతో ఆసుపత్రి ప్రాంగణం ఒక్కసారిగా రోదనలతో మిన్నంటింది. పలాస జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. టెక్కలి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఆర్డీవో తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు.

### రైలు ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

టెక్కలి మండలం రావివలస సమీపంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన సాల్మన్‌రాజుకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# వరహాలగెడ్డకు పోటెత్తిన వరద

- 1,000 క్యూసెక్కుల ప్రవాహం
- కంబ్రిగాం కాజ్‌వే వద్ద అప్రమత్తత
- పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో గరిష్ఠ నీటిమట్టానికి చేరిన చెరువులు
- కాజ్‌వే వద్ద పోలీసు పహారా..స
- లోతట్టు ప్రాంతాల ప్రజలకు అధికారుల హెచ్చరిక



**పలాస, సెప్టెంబరు 23 (వార్త):** తీవ్ర తుపాను ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వరహాలగెడ్డ ఉధ్ధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో గెడ్డలో ప్రస్తుతం సుమారు 1,000 క్యూసెక్కుల ప్రవాహం నమోదవుతోందని వంశధార ప్రాజెక్టు ఈఈ శేఖర్‌బాబు తెలిపారు. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలాస మండలం కంబ్రిగాం సమీపంలోని కాజ్వేను ఈఈ శేఖర్‌బాబు బుధవారం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు నిరంజన్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ప్రవాహం, కాజ్వే పరిస్థితి, నీటి ఉధ్ధృతిని పరిశీలించి అక్కడి పరిస్థితిపై అధికారులకు సూచనలు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రజల రాకపోకలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. భారీ వర్షాలతో పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని చెరువులు చాలావరకు నిండిపోయాయి. కొన్ని చెరువులు గరిష్ఠ నీటిమట్టానికి చేరుకోవడంతో అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వరద ఉధృతి పెరిగితే దిగువ ప్రాంతాలకు నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నారు. వరహాలగెడ్డ ఉధ్ధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో కంబ్రిగాం కాజ్వే వద్ద కాశీబుగ్గ పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజలు ఆసక్తితో కాజ్వే వద్దకు చేరడం, వరద నీటిలోకి దిగడం, చేపల వేటకు వెళ్లడం వంటి చర్యలకు పాల్పడకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. వరద ప్రవాహాన్ని దాటేందుకు ఎవరూ సాహసం చేయవద్దని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున పిల్లలు, వృద్ధులు గెడ్డలు, వాగులు, కాజ్వేల సమీపానికి వెళ్లకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన చోట ముందస్తు రక్షణ చర్యలు చేపడుతున్నామని ఈఈ శేఖర్‌బాబు వెల్లడించారు.

## ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి



**పాతపట్నం, సెప్టెంబరు 23(వార్త):** తుఫాన్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి నష్టం జరగకుండా తగిన ముందస్తు చర్యలు ప్రభుత్వం చేపడుతుందని స్థానిక టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచనల మేరకు మహేంద్రతనయ నదికి ఆనుకొని ఉన్న కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామాల్లో బుధవారం మేజర్ పంచాయతీ ఈవో రామచంద్రరావుతో కలిసి టీడీపీ నాయకులు పైల బాబ్జి, సైలాడ సతీష్, అక్కంద్ర సన్యాసిరావు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పరిస్థితిని పరిశీలించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాల అండగా ఉంటామని వారు భరోసా కల్పించారు. ఒకవేళ ముంపు ప్రభావం తీవ్రంగా ఉంటే పునరావాస కేంద్రాలకు తరలిస్తామని తెలిపారు. మహేంద్రతనయ నదిపై ఉన్న కాజ్ వే నీట మునిగినందున రాబోయే రెండు మూడు రోజులు ప్రయాణాలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉందని, ప్రమాదకరంగా మారిన కాజ్ వే మీద నుంచి ఎవరూ రాకపోకలు సాగించకూడదని సూచించారు.

## కృష్ణానగర్‌లో నిలిచిన వర్షపు నీరు



**పాతపట్నం, సెప్టెంబరు 23(వార్త):** పాతపట్నంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న కృష్ణానగర్ వీధి వద్ద వర్షపు నీటితో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కాలనీలోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ఆ నీరంతా మురుగునీటిలా వీధి మొదట్లోనే నిలిచిపోయి జలమయమైంది. నీరు భారీగా పోగుపడటంతో కాలనీ నుంచి బయటకు వెళ్లడానికి, అలాగే లోపలికి రావడానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. పసిపిల్లలు, వృద్ధులు, మహిళలు ఈ బురద, వర్షపు నీటిలోనే రాకపోకలు సాగించలేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషాదకర పరిస్థితిపై స్థానిక అధికారులు తక్షణమే స్పందించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. కనీసం ఒక పొక్లెయిన్ పంపించి నిలిచిపోయిన వరద నీటిని పక్కనే ఉన్న ప్రధాన కాలువలోకి మళ్లించేలా చర్యలు చేపడితే తమకు కొంతవరకు ఉపశమనం లభిస్తుందని స్థానికులు కోరుతున్నారు.

## ఆర్య వైశ్యులకు ఒక్క అవకాశం ఇవ్వండి



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 23 (వార్త):** ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో ఆర్య వైశ్యులకు ఒక్క అవకాశం ఇవ్వాలని ఆ సామాజిక వర్గం కోరుతోంది. ఈ మేరకు ప్రముఖ బంగారం వ్యాపార వేత్త వెచ్చా కేశవరావుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ క్యాంపు కార్యాలయంలో వారు భేటీ అయ్యారు. ఇటీవలి తెలుగుదేశం పార్టీ నిర్వహించిన సమావేశంలో కేశవరావు రేసులో ఉన్నట్లు అధిష్టానం దృష్టికి తీసుకొని వెళ్లిన సంగతి తెలిసిందే. తన తండ్రి దివంగత వెచ్చా కామేశ్వరరావు 1964,1982 లలో రెండు పర్యాయాలు ఇచ్ఛాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ గా పని చేసిన విషయం వివరించారు. గత మున్సిపల్ ఎన్నికలులో కేవలం ఒక్క ఓటు తేడా తో ఓటమి చవి చుసినప్పటికి మైనార్టీలకు అవకాశం కల్పిస్తే సమర్ధ వంతమైనా నీతి వంతమైన అవినీతి రహిత పాలన అందిస్తామని చెప్పారు. ప్రస్తుతం రిజర్వేషన్ ప్రక్రియ తేలకపోవడంతో రిజర్వేషన్ వెలవడ్డాక అధిష్టానం పరిశీలిస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు.

## నిరుపేదలకు అండగా సాయి భక్తులు



**కవిటి, సెప్టెంబరు 23 (వార్త):** కవిటి మండలం రాజపురం గ్రామానికి చెందిన సాయిరాం భక్త బృందం సభ్యులు ప్రతినెల వాళ్ళ కుటుంబాలకు తగువిధంగా సహాయపడుతూ అండగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ నెలకి సంబంధించి బుధవారం తేలుకుంచి గ్రామంలో ఋషి బాడిత్య, బింగిపుట్టుక గ్రామంలో టెంక పుణ్యవతి, కే.తొత్తిడి పుట్టుక గ్రామంలో పొడియా జ్యోతి, రాజపురంలో బి.వరహాలు లకు నెలకు సరిపడా కిరాణా సామాగ్రి అందజేశారు. అలాగే స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

## ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### - జనసేన నాయకురాలు కొరికాన భవాని

**ఎల్‌ఎన్ పేట/హిరమండలం, సెప్టెంబరు 23(వార్త):** గత మూడు రోజులుగా అర్నాబ్ సైక్లోన్ తుఫాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు వలన రెవెన్యూ, పోలీస్ తధితర అధికారుల సలహాలు, సూచనలు పాటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందన్నారు. అవసరమైన చోట్ల జనసైనికులు సహాయక చర్యల్లో పాల్గొనాలని కోరారు.



# బురదలో దిగి పూడిక తీసిన సలాన



**పాతపట్నం, సెప్టెంబరు 23(వార్త):** ప్రజాసేవ అంటే కేవలం వేదికలపై ఉపన్యాసాలు దంచడం, అధికారంలోకి వచ్చినప్పుడు ఇచ్చే హామీలకే పరిమితం కాదని, ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే నిజమైన నాయకత్వ లక్షణమని బిజెపి సీనియర్ నాయకులు డాక్టర్ సలాన శరత్ కుమార్ మరోసారి నిరూపించారు. పాతపట్నం ప్రాంతంలో కురిసిన ఈ భారీ వర్షానికి స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ ప్రాంగణం పూర్తిగా జలమయమైంది. బస్సు స్టాండ్ అంతటా భారీగా నీరు నిలిచిపోవడంతో మోకాళ్ల లోతు నీటిలో ప్రయాణికులు, నిత్యం ప్రయాణించే పౌరులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో పాటు మురుగు కాల్వల్లో చెత్తాచెదారం నిండిపోయి నీరు ముందుకు సాగక నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. పసిపిల్లలు, వృద్ధులు, మహిళలు బురద నీటిలోనే నడవలేక నానా అవస్థలు పడ్డారు. ఈ విషాదభరిత పరిస్థితిని గమనించిన డాక్టర్ సలాన శరత్ కుమార్ క్షణం కూడా ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించారు. తాను ఒక దంత వైద్యుడ్ని (డాక్టర్) అని, బిజేపీ జాతీయ పార్టీ సీనియర్ నాయకుడిని అనే నాయకత్వ హోదాలను పక్కన పెట్టి స్వయంగా గ్రౌండ్ లెవెల్లో నిలబడ్డారు. ఏమాత్రం సంకోచించకుండా బురద నీటిలోకి దిగి, డ్రైనేజీకి అడ్డుగా పడిన చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తన చేతులతో స్వయంగా తొలగించారు. మురుగు నీరు సజావుగా సాగిపోయేలా మార్గాన్ని సుగమం చేశారు.

రాజకీయాల్లో మాటల ప్రవాహం ఎక్కువైపోయిన ఈ రోజుల్లో, చేతల్లో నిజమైన ప్రజాసేవను చూపించిన డాక్టర్ శరత్ కుమార్ చొరవకు బస్ స్టాండ్‌లోని ప్రయాణికులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నాయకుడంటే ప్రజా సమస్యలను చూసి వెళ్ళిపోయేవాడు కాదు... స్వయంగా సమస్య పరిష్కారంలో భాగమయ్యేవాడు అని ప్రయాణీకులు ఆయనను మనస్ఫూర్తిగా అభినందించారు. శరత్ కుమార్ చూపిన ఈ మానవతా దృక్పథం, సామాజిక బాధ్యత అందరికీ ఆదర్శంగా నిలిచింది.

# తుఫాన్‌ను సమర్ధంగా ఎదుర్కొన్న విద్యుత్ సిబ్బంది

- -ముందస్తు చర్యలు.. ఎక్కడ అంతరాయం తలెత్తినా తక్షణ స్పందన
- -సిబ్బందిని ముందుండి నడిపించిన డీఈఈ జి. విఙ్ఞేశ్వరరావు
- -'శభాష్ విద్యుత్ శాఖ' అంటూ వినియోగదారుల ప్రశంసలు

**పలాస, సెప్టెంబరు 23 (వార్త):** తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి, విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్న ప్రమాదకరమైన చెట్ల కొమ్మలను తొలగించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది.



పలాస విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. విఙ్ఞేశ్వర రావు ఆధ్వర్యంలో ఏఈలు వివేకానంద, జి.నాగభూషణ్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ఇతర అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ విద్యుత్ లైన్లు, స్తంభాల పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి వాటిని తొలగిస్తున్నారు. సమస్య ఉన్న చోటే సిబ్బంది ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడిన సమాచారం అందిన వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని మరమ్మతులు చేపడుతున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తూ సరఫరాను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు మరమ్మతు బృందాలను అందుబాటులో ఉంచారు. తుఫాన్ సమయంలో చెట్ల కొమ్మలు లైన్లపై పడటం, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అవసరమైన చోట్ల లైన్లు, స్తంభాలను పరిశీలించి లోపాలను ముందుగానే గుర్తించి సరిచేస్తున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు సిబ్బంది చేస్తున్న కృషిపై వినియోగదారులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి విద్యుత్ శాఖ చేపట్టిన చర్యలు, సమస్య తలెత్తిన వెంటనే స్పందిస్తున్న తీరు అభినందనీయమని పలువురు అంటున్నారు. 'శభాష్ విద్యుత్ శాఖ' అంటూ సిబ్బందిని అభినందిస్తున్నారు. వినియోగదారులకు వీలైనంత మేరకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని డీఈఈ జి.విఙ్ఞేశ్వరరావు తెలిపారు.

# మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణే కీలకం

- - పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం
- -సేవా కార్యక్రమాల్లో భాగంగా అమ్మ ఆశ్రమం రహదారికి ఇరువైపులా మొక్కలు నాటిన భాజపా కార్యకర్తలు

**పలాస, సెప్టెంబరు 23 (వార్త):** మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు పాలవలస వైకుంఠరావు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం అమ్మ ఆశ్రమానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా వివిధ రకాల మొక్కలను నాటారు.

సేవా కార్యక్రమాలను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే కార్యక్రమాలుగా నిర్వహించాలనే ఉద్దేశంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. రహదారుల వెంట పచ్చదనం పెరిగితే ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు భవిష్యత్తులో నీడ కూడా లభిస్తుందని ఆయన చెప్పారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను కూడా తీసుకుంటామని తెలిపారు. మొక్కలు నాటడంతోనే కార్యక్రమం పూర్తికాదని, వాటికి నీరు అందించడం, పశువుల నుంచి రక్షించడం, ఎండిపోకుండా పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టినప్పుడే ఆశించిన ఫలితం లభిస్తుందని ఆయన తెలిపారు. ఒక మొక్కను నాటి పెంచడం అంటే భవిష్యత్తులో ఒక చెట్టును, దాని ద్వారా అనేక జీవులకు ఆవాసాన్ని, ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించడమేనని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణని, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు మాత్రమే కాకుండా ప్రతి కుటుంబం, విద్యార్థి, యువత మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి పరిసరాలు, పాఠశాలలు, రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో స్థానిక వాతావరణానికి అనుకూలమైన మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తే పట్టణాల్లో పచ్చదనం గణనీయంగా పెంచవచ్చని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నెల రోజులపాటు వివిధ సేవా కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు వెల్లడించారు. సమాజహితం, పర్యావరణ పరిరక్షణ, సేవాభావాన్ని ప్రధాన లక్ష్యాలుగా తీసుకుని కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప ఉత్సవ కమిటీ సభ్యుడు రామానంద స్వామి, బూర్జి కోటేశ్వరరావు, భవాని స్వాములు తదితరులు పాల్గొన్నారు.




# ఇచ్ఛాపురం నుంచి గోదావరి గట్టు వరకు కళింగమే

### -కళింగ రాష్ట్ర సాధనే అంతిమ లక్ష్యం -దువ్వాడ జీవితేశ్వరరావు



**పలాస, సెప్టెంబరు 23 (వార్త):** ఇచ్ఛాపురం నుంచి గోదావరి గట్టు వరకు విస్తరించిన ప్రాంతమే చారిత్రకంగా అసలైన కళింగమని, ఈ ప్రాంతాన్ని ప్రత్యేక కళింగ రాష్ట్రంగా ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని కళింగ సీమ సాధన సమితి కన్వీనర్, ప్రముఖ డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు తెలిపారు. పలాసలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన కళింగ చరిత్ర, రాజధానులు, సముద్ర వాణిజ్యం, ఆలయ నిర్మాణ శైలి, భౌగోళిక విస్తీర్ణంపై పలు అంశాలను ప్రస్తావించారు. ప్రస్తుతం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను మాత్రమే ఉత్తరాంధ్రగా పిలవడం వ్యవహారిక నామమే తప్ప చారిత్రకంగా సరైనది కాదని జీవితేశ్వరరావు అన్నారు. మహానది నుంచి గోదావరి వరకు, వంశధార, నాగావళి, గోస్తనీ, శారద తదితర నదుల పరీవాహక ప్రాంతాలు చారిత్రక కళింగంలో భాగమని తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి అంతర్వేది, రాజమండ్రి, భద్రాచలం పరిసరాల వరకు విస్తరించిన ప్రాంతాన్ని దక్షిణ కళింగంగా పరిగణించాల్సి ఉందన్నారు. కళింగ రాజ్యానికి దంతపురం తొలి రాజధానిగా చరిత్రలో ప్రస్తావన ఉందని, అనంతరం వంశధార నది సముద్రంలో కలిసే ప్రాంతంలోని కళింగపట్నం కీలక పాలనా కేంద్రంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. కళింగపట్నం రేవు ద్వారా బాలి, జావా, సుమత్రా, మలేషియా తదితర ప్రాంతాలతో సముద్ర వాణిజ్య సంబంధాలు సాగాయని, కళింగుల సముద్రయాన సంప్రదాయానికి బాలి యాత్ర వంటి ఆచారాలు వారసత్వంగా నిలిచాయని చెప్పారు. చోళులు, పల్లవుల దాడుల నేపథ్యంలో కళింగ రాజులు శ్రీముఖలింగం సమీపంలోని కటకం ప్రాంతాన్ని రక్షణ కేంద్రంగా వినియోగించారని జీవితేశ్వరరావు తెలిపారు. 'కటకం' అంటే కోట, రక్షణ వలయం అనే అర్థం వస్తుందని, ఈ ప్రాంతపు చారిత్రక ప్రాధాన్యం తరువాతి కాలంలో ఇతర ప్రాంతాల పట్టణ నిర్మాణాలపై కూడా ప్రభావం చూపిందని అన్నారు.

### ఆలయాల నిర్మాణంలో కళింగ ముద్ర :

శ్రీకాకుళంలోని శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు ఆలయం, శ్రీముఖలింగం ఆలయం, అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో కళింగ వాస్తుశైలికి సంబంధించిన లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. కళింగ చరిత్రను కేవలం ప్రస్తుత ఒడిశా చరిత్రకు పరిమితం చేయకుండా ఉత్తరాంధ్ర, గోదావరి ప్రాంతాల చారిత్రక వారసత్వంతో కలిపి చూడాల్సిన అవసరం ఉందన్నారు.

### 1936లో ఒడిశా ఏర్పాటు :

కోసల--కళింగ అంశంని, 1936లో బ్రిటిష్ పాలనలో ఒడిశా రాష్ట్రం ఏర్పడిన సమయంలో వివిధ భౌగోళిక, పరిపాలనా ప్రాంతాలు ఒకే రాష్ట్రంలోకి వచ్చాయని జీవితేశ్వరరావు చెప్పారు. కోసల ప్రాంతం, కళింగ ప్రాంతాల చారిత్రక నేపథ్యాలు వేర్వేరని తెలిపారు. భవిష్యత్తులో ప్రాంతీయ గుర్తింపుల ఆధారంగా కొత్త రాష్ట్రాల డిమాండ్లు ఉద్భవించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం 'ఉత్తరాంధ్ర'గా పిలుస్తున్న ప్రాంతానికి చారిత్రకంగా 'కళింగ' అనే పేరు మరింత సముచితమని ఆయన చెప్పారు. 'కళింగాంధ్ర' వంటి పదాలతో ఆంధ్ర అనే అనుబంధాన్ని జోడించడం కంటే కళింగ చారిత్రక గుర్తింపును ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన జరిగితే 'కళింగ' పేరునే అధికారికంగా పెట్టాలన్నదే తమ అభిమతమని స్పష్టం చేశారు. కళింగ చరిత్రకు సంబంధించిన శాసనాలు, చారిత్రక ఆధారాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ ఉద్యమ ఉద్దేశమని జీవితేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు, యువత, మేధావులు, చరిత్రకారులు ఈ అంశంపై అధ్యయనం చేసి ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం వ్యవహారికంగా స్థిరపడిన 'ఉత్తరాంధ్ర' పేరుతోనే ఉద్యమ కార్యక్రమాలను కొనసాగిస్తూ, కళింగ చారిత్రక గుర్తింపును ప్రజల్లోకి తీసుకెళ్తామని ఆయన తెలిపారు.



# పవన్ కల్యాణ్‌ను కలిసిన కోత పూర్ణచంద్రరావు

### పలాస నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ వ్యవహారాలపై చర్చ

**పలాస, సెప్టెంబరు 23 (వార్త):** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌ను పలాస నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు బుధవారం రాజమండ్రి విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, స్థానిక రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై చర్చించినట్లు పూర్ణచంద్రరావు తెలిపారు. పార్టీ అధినేతను కలవడం ద్వారా నియోజకవర్గంలోని ప్రస్తుత పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ముఖ్యంగా పలాస--కాశీబుగ్గ పట్టణంలో మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి ప్రజలకు నేరుగా సంబంధించిన అంశాలపై సమగ్ర దృష్టి అవసరమని వివరించినట్లు తెలిపారు. జనసేనను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పూర్ణచంద్రరావు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలతో నిరంతరం మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత పార్టీ నాయకత్వంపై ఉందన్నారు. రాజమండ్రి విమానాశ్రయంలో జరిగిన ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. ముఖ్యంగా పలాస మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పూర్ణచంద్రరావు పవన్ కల్యాణ్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

జాతీయ **వార్త**
తెలుగు దిన పత్రిక

**శ్రీకాకుళం**

# పలాసలో.. కుండపోత

**-లోతట్టు ప్రాంతాలు జలమయం.**

**-ఇళ్లలోకి వరద నీరు**

**ఉధృతంగా వాగులు, గెడ్డలు**

**- ఏడుగురి సురక్షిత ప్రాంతాలకు తరలింపు**

**- పలాసలో 85 మి.మీ., వజ్రపుకొత్తూరులో**

**62 మి.మీ. వర్షపాతం నమోదు**



**పలాస, సెప్టెంబరు 23 (వార్త):** శ్రీకాకుళం జిల్లాపై వాయుగుండం ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో బుధవారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. గంటల తరబడి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తీర ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీయడంతో ఆందోళన నెలకొంది.

## ఇళ్లలోకి వరద నీరు..

వజ్రపుకొత్తూరు మండలంలోని సున్నాల చెరువు నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో హుకుంపేట గోజ్జర్ వీధిలోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. ఒక్కసారిగా వరద నీరు ఇళ్లను చుట్టుముట్టడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. రహదారులపై కూడా నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఏడుగురి తరలింపును అధికారులు చేపట్టారు. వర్షాల నేపథ్యంలో మట్టి ఇళు,, పూరిళ్లకు ప్రమాదం పొంచి ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ఏడుగురిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. పలాస మండలంలో భారీ వర్షాలతో వాగులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. పలు గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లో వరద పరిస్థితులు నెలకొన్నాయి. వర్షానికి తోడు బలమైన ఈదురుగాలులు వీయడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలాస పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలకు ఇబ్బందులు మరింత పెరిగాయి. తీర ప్రాంత గ్రామాల్లో వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వాగులు, గెడ్డలు దాటే ప్రయత్నం చేయవద్దని, నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్న ప్రాంతాల్లో రాకపోకలు సాగించవద్దని సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులను సంప్రదించాలని కోరుతున్నారు.



## 85 మి.మీ. వర్షపాతం..

అధికారుల వివరాల ప్రకారం.. పలాస మండలంలో 85 మిల్లీమీటర్లు, వజ్రపుకొత్తూరు మండలంలో 62 మిల్లీమీటర్లు, మందస మండలంలో 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాయుగుండం ప్రభావంతో రానున్న గంటల్లోనూ వర్షాలు కొనసాగే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు.

ప్రస్తుతం వాగులు, గెడ్డల్లో నీటి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం అత్యవసరంగా మారింది. ముఖ్యంగా చెరువులు, కాలువలు, వంతెనలు, లోతట్టు ప్రాంతాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## రాంపురంలో ఇంటిపై పడిన కొబ్బరి చెట్టు



**మందస, సెప్టెంబరు 23(వార్త):** రాంపురం గ్రామంలో జుత్తు ముత్యాలమ్మ అనే వృద్ధురాలి ఇంటిపై కొబ్బరి చెట్టు హటాత్తుగా పడింది. తుపానుతో వర్షంతో పాటు గాలి వీస్తుండడంతో చెట్టకు ఒక్కసారిగా ఇంటిపై పడడంతో పాక్షికంగా ఇల్లు దెబ్బతింది. అదృష్టవశాత్తూ చెట్టు పడిన ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. వీఆర్వో క్రాంతి కుమార్, సెక్రటరీ పద్మావతి, సచివాలయ సిబ్బంది అగ్రికల్చర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ సంఘటనా స్థలానికి వెళ్లి, పరిశీలించారు. ఇంట్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. పెద్ద ప్రమాదం తప్పడం గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

## తుఫాన్ పనుల్లో అగ్నిమాపక శాఖ




**కవిటి, సెప్టెంబరు 23 (వార్త):** సోంపేట అగ్నిమాపక శాఖ తుఫాను నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదిక చర్యల్లో నిమగ్నమైంది. అగ్నిమాపక అధికారి ఆర్. సూర్యారావు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కవిటి మండలం ఇంటి వెనక పుట్టుగ గ్రామ రహదారిలో బుధవారం చెట్లు నేల కొరగడంతో సమాచారం అందుకొని వెంటనే అక్కడికి చేరుకున్నారు. వారి వద్ద గల చిన్నపాటి యంత్రాలతో చెట్లను కత్తిరించి బయటకు తొలగించారు. రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ తమ పరిధిలో సమాచారం వచ్చిన వెంటనే వెళ్లి అగ్నిమాపక శాఖ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## తుపాను బాధిత ప్రాంతాల్లో ఇరిగేషన్ అధికారుల పర్యటన



**మందస, సెప్టెంబరు 23(వార్త):** అర్నబ్ తుపాను ప్రభావంతో మందస మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీషమ్మ ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.వి.శ్రీనివాసరావు సునాముది గెడ్డ, డిమిరియా, దేశబట్టి ఛానల్, మందస పట్టణంలోని జెన్నా చెరువు, హంసరాలి వద్ద గల బ్రిడ్జి, మందస పట్టణంలోని గోపాలసాగరం తదితర ప్రాంతాలను పరిశీలించారు. వరద ఉధృతిని అంచనా వేశారు. పంటలకు నష్టం కలిగే విధంగా నీటి ప్రవాహం ఉంటుందా.. లేక తుపాను ప్రభావంతో మరింత వరదలు వస్తాయా.. అని చర్చించారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలను అందివ్వనున్నట్టు ఏఈ శ్రీనివాసారవు చెప్పారు. ఆయనతో పాటు సునాముది సిస్టం-1 చైర్మన్ రట్టి లింగరాజు, దామోదరసాగరం రిజర్వాయర్ చైర్మన్ గేదెల దుర్యోధన, టీసీ మెంబర్లు అభిమన్యుసాహు, కొర్రాయి శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జి ముంజేటి చంద్రశేఖర్, పల్లి చంద్రయ్య పాల్గొన్నారు.

# వంశధారలో పెరుగుతున్న వరద నీరు

**- మరో రెండు రోజుల్లో వరద ఉధృతి పెరిగే అవకాశం**

**- కొమనాపల్లి వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించిన ఎస్సై**

**- పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**- సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచన**



**జలుమూరు, సెప్టెంబరు 23 (వార్త):** వంశధార నదిలో వరద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్‌బాబు సూచించారు. బుధవారం జలుమూరు మండలం కొమనాపల్లి గ్రామం వద్ద నదిలోని వరద నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడిన ఎస్సై నదిలో నీటి మట్టం పెరుగుతున్న పరిస్థితులను వివరించారు. రానున్న రెండు రోజుల్లో వరద నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున పరివాహక ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నదికి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వరద నీటి కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు. ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. గ్రామస్థులు అధికారుల సూచనలు పాటిస్తూ సహకరించాలని ఆయన సూచించారు.

## అదృశ్యమైన వ్యక్తి మృతదేహమై తేలాడు

**- ఎల్‌ఎన్ పేట వైన్ షాపు వెనుక మృతదేహం లభ్యం**

**- ధనుకువాడలో విషాదఛాయలు**



**ఎల్‌ఎన్ పేట, సెప్టెంబరు 23(వార్త) :** ధనుకువాడ గ్రామానికి చెందిన చిన్నాల విశ్వనాధం(52) మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 20వ తేదీ నుంచి విశ్వనాధం కనిపించడం లేదని తన భార్య చిన్నాల శారద సరుబుజ్జిలి పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేశారు. అప్పటినుంచి కుటుంభ సభ్యులతో పాటు గ్రామస్థులు వెతుకులాట ప్రారంభించారు. బుధవారం ఉదయం ఎల్‌ఎన్ పేట జంక్షన్, యంబరాం రోడ్డు దగ్గరలో ఉన్న వైన్ షాప్ వెనుక స్థానికులు మృతదేహాన్ని చూసి సరుబుజ్జిలి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో



సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని విశ్వనాధం మృతదేహంగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి పోస్టుమార్టంనకు తరలించామన్నారు. విశ్వనాధంకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం చేశారు. భార్య శారద పిర్యాదు మేరకు సరుబుజ్జిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ధనుకువాడ గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

## తుఫాన్ ప్రభావంతో అప్రమత్తంగా ఉండాలి




**నరసన్నపేట, సెప్టెంబరు 23 (వార్త):** తుఫాన్ ప్రభావంతో నరసన్నపేట మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మురళీమోహన్ కుమార్ సూచించారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని గొర్రెబంద-స్వర్ణ గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, అందుబాటులో ఉన్న సేవలు, గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు మరింతగా కురిసే అవకాశం ఉన్నందున గ్రామాల్లో పరిస్థితులను నిరంతరం గమనించాలని సూచించారు. మురుగు కాలువలు పొంగిపొర్లే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశమున్నందున ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా సిబ్బంది అందుబాటులో ఉండాలని ఎంపీడీవో సూచించారు.

# భారీ వర్షాలతో తిలారు అండర్ పాస్ జలమయం



**జలుమూరు, సెప్టెంబరు 23 (వార్త):** కూడలి వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్ మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పూర్తిగా జలమయమైంది. దీంతో తిలారు రైల్వే స్టేషన్ మీదుగా పలు గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అండర్ పాస్‌లో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ మార్గం మీదుగా నిత్యం పలు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుండటంతో నీటి నిల్వ కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో నీటిలోనే ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ అండర్ పాస్‌లో నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. అండర్ పాస్‌లో నిలిచిన నీటిని త్వరితగతిన మళ్లించడంతో పాటు భవిష్యత్తులో వర్షపు నీరు నిల్వ కాకుండా తగిన డ్రైనేజీ, నీటి మళ్లింపు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను స్థానికులు కోరారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 23 (వార్త):** అర్నాబ్ సైక్లోన్ కళింగ పట్నం దగ్గర తీరం దాటనుందని, ఈ ప్రభావం శ్రీకాకుళం నుండి ఇచ్ఛాపురం అన్ని నియోజవర్గాల్లో ప్రభావం చూపనుందని, జిల్లా ప్రజలు అత్యంత అప్రమత్తం గా ఉండాలని జిల్లా బిజెపి ట్రేడ్ సెల్ కన్వీనర్ గుడిసె సాయి కామేష్ కోరారు.. అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని మత్యకారులు సురక్షిత ప్రాంతాలకు



వెళ్లాలని ప్రజలు హోర్డింగ్, విద్యుత్ స్తంభాలు , బలహీనమైన భవనాలు దగ్గర ఉండరాదని . జిల్లా యంత్రాంగం విప్పతు నిర్వహణ శాఖ టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటుచేసిందని . విపత్తు నిర్వహణ సూచించిన సూచనలు ప్రతి ఒక్కరు పాటించాలి అని కోరారు.ప్రజలు ప్రాణాలు ప్రధాన లక్ష్యం అని . శ్రీకాకుళం జిల్లా ప్రజలు, ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలు అప్రమత్తం ఉండాలని అన్నారు.

# వర్షపు నీటిలో సుసరాం తంపర భూములు

**- వేలాది ఎకరాల్లో వరి పంటకు నష్టం**

**- శ్రీ కనకదుర్గమ్మ ఆలయాన్ని చుట్టుముట్టిన వరద**

**పోలాకి, సెప్టెంబరు 23 (వార్త):** పోలాకి మండలం సుసరాం గ్రామంలోని తంపర భూముల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో వేలాది ఎకరాల వరి పొలాలు నీటమునిగాయి. దీంతో చేతికొచ్చే దశలో ఉన్న పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ తమ పంట భూముల్లోకి నీరు చేరి నష్టాలు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారు. తంపర భూముల్లో నీరు నిలిచిపోవడంతో పొలాల నుంచి నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు తెలిపారు. ఈ సమస్య కారణంగా ప్రతి వర్షాకాలంలో పంటలకు నష్టం వాటిల్లుతోందని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. నీటి ప్రవాహానికి అవసరమైన మార్గాలను మెరుగుపరచి, ముంపు సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా సుసరాం గ్రామంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం కూడా భారీ వర్షపు నీటితో చుట్టుముట్టింది. బుధవారం కురిసిన వర్షాలతో ఆలయ పరిసర ప్రాంతాల్లోకి వరదనీరు చేరి పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



## వర్షాలతో పొంగిపొర్లుతున్న చెరువులు

**సారవకోట, సెప్టెంబరు 23 (వార్త):** సారవకోట మండలంలో మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలతో వాగులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా నీరు చేరడంతో పలు చెరువులు నిండుకుండల్లా మారి మిగులు నీరు బయటకు ప్రవహిస్తోంది. మండలంలోని అలుదు పెద్ద చెరువు, చోడసముద్రం ఊర చెరువు, రంగసాగరం, గోపాలపురం గ్రామంలోని గోపాలసాగరం చెరువులకు భారీగా నీరు చేరింది. దీంతో ఆయా చెరువుల నుంచి నీరు బయటకు ప్రవహిస్తూ పరిసర ప్రాంతాల్లో జల ప్రవాహం కనిపిస్తోంది. వరుసగా కురుస్తున్న వర్షాలతో వాగుల్లోనూ నీటి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు. చెరువులు, వాగుల వద్దకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో మోహన్‌కుమార్ సూచించారు. ముఖ్యంగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చిన్నారులు, వృద్ధులు వెళ్లకుండా కుటుంబసభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.



## యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు

**సోంపేట, సెప్టెంబరు 23 (వార్త):** సోంపేట మేజర్ పంచాయతీలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత రెండు రోజులుగా యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపడుతున్నారు. ఇంచార్జ్ ఈవో ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా జెసిబి యంత్రాన్ని ఉపయోగిస్తూ కాలువలలో పేరుకుపోయిన భారీ చెత్త చేదారాలను బయటకు తీసి ట్రాక్టర్ల ద్వారా పట్టణం వెలుపలకు తరలిస్తున్నారు. మురికి కాలువల్లో ఎక్కడా ఆటంకాలు లేకుండా మురికి నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నారు. చిన్న చిన్న వీధుల్లోనూ దృష్టి సారించి మురికి కాలువలు శుభ్రం చేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# జగన్‌తో భారతీదివ్య దంపతుల భేటీ

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 23 (వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ని ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన ద్వారక హాస్పిటల్ ఎం డి డాక్టర్ ఉలాల శేష యాదవ్, జిల్లా వైఎస్సార్సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, తాజా మాజీ మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ ఉలాల భారతి యాదవ్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎన్నికలు నేపథ్యంలో ప్రస్తుతం రేసులో ఉన్న భారతీదివ్య భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులు, పార్టీ బలోపేతం, తదితర అంశాలపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సుదీర్ఘంగా చర్చించామని వివరించారు ప్రత్యేకంగా ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన నాయకులు, కార్యకర్తల సేవలను గుర్తించడం, స్థానిక సామాజిక సమీకరణాలు మరియు ప్రజల్లో ఉన్న నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని భవిష్యత్ బాధ్యతలు కల్పించడం వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ ప్రసాద్ రెడ్డి తో సమన్వయంతో కలిసి పనిచేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఉలాల భారతి యాదవ్ మాట్లాడుతూ "పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం ఎంతో సంతోషంగా ఉందని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ ప్రసాద్ రెడ్డి తో సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తాను." అని తెలిపారు. డా. ఉలాల శేష యాదవ్ మాట్లాడుతూ నాయకత్వం ఇచ్చే దిశానిర్దేశంతో ప్రజల్లో నిరంతరం ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ఐక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.జగనన్నను కలిసిన సమయంలో ఆయన ఆప్యాయంగా చిరునవ్వుతో భారతమ్మ అని పలకరించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని, సుమారు 5 నిమిషాల పాటు జగనన్నతో ఆత్మీయంగా మాట్లాడే అవకాశం లభించిందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ ఇంచార్జి శ్యామ్ ప్రసాద్ రెడ్డి కి పూర్తి మద్దతుగా నిలిచి, పార్టీ కోసం పూర్తిస్థాయిలో పనిచేస్తున్న విషయాన్ని జగన్



మోహన్ రెడ్డి కి తెలియజేశామని చెప్పారు.గత మున్సిపల్ ఎన్నికల్లో వైస్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన విధానం, ప్రజలకు అందుబాటులో ఉంటూ చేసిన సేవా కార్యక్రమాల గురించి వివరించామని,గత మున్సిపల్ ఎన్నికల సమయంలో గర్భిణిగా ఉన్నప్పటికీ నామినేషన్ వేసి, అనంతరం బాలింతగా ఉన్న సమయంలో కూడా ఎన్నికల ప్రచారంలో కష్టపడి పనిచేసిన విషయాన్ని తెలియజేశానని వివరించారు.తన రాజకీయ ప్రస్థానంలో తన మామయ్య మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉలాల బాలయ్య పాత్ర, ఆయన రాజకీయ ప్రయాణం మరియు ప్రజలతో ఆయనకున్న అనుబంధం గురించి కూడా జగనన్న అడిగి తెలుసుకున్నారని చెప్పారు. ఆప్యాయంగా "శేషు" అని పిలిచి, శ్యామ్ ప్రసాద్ రెడ్డి కోసం కష్టపడి పనిచేసి, ఆయనను గెలిపించి తీసుకురావాలని జగనన్న సూచించారని ఈ సందర్భంగా రానున్న మున్సిపల్ ఎన్నికలు, పార్టీ బలోపేతం, స్థానిక రాజకీయ పరిస్థితులపై కూడా కొద్దిసేపు చర్చించడం జరిగిందని జగనన్నతో జరిగిన ఈ ఆత్మీయ సమావేశం తమకు మరింత ఉత్సాహాన్ని, బాధ్యతను కలిగించిందని అన్నారు.

## తుపాను ప్రాంతాల్లో సీడీపీఓ పర్యటన



**మందస, సెప్టెంబరు 23(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతంలో ఐసీడీఎస్ సీడీపీఓ పెద్దింటి అరుణ బుధవారం పర్యటించారు. తీర ప్రాంతంలో వర్షం, గాలి ఎక్కువగా ఉండడంతో ప్రజలను అప్రమత్తం చేశారు. సిగలపుట్టుగలో గృహ సందర్శన చేసి, తొమ్మిది నెలల గర్భిణీకి టీహెచ్ఆర్ పంపిణీ చేశారు. అదేవిధంగా అంగన్ వాడీ కేంద్రం సందర్శించి, పరిసర ప్రాంతాలు, రికార్డులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ జె.లక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్త, ఆయా పాల్గొన్నారు.

## మీ సేవలు ఎన్నటికీ మరువలేము

### -డాక్టర్ దాసు దంపతులకు సన్మానం



**సోంపేట, సెప్టెంబరు 23 (వార్త):** మండల అధ్యక్షునిగా గడచిన ఐదేళ్లు కాలం ప్రజలకు అందించిన సేవలు, ఉద్యోగులతో సమన్వయం ఎన్నటికీ మర్చిపోలేమని సోంపేట మండల పరిషత్ అధికారులు, సిబ్బంది ఎంపీపీ డాక్టర్ దాసును కొనియాడారు. పదవీకాలం ముగిసిన సందర్భంగా బుధవారం సాయంత్రం ఎంపీపీ కార్యాలయంలో డాక్టర్ దాసు దంపతులను కలసి ఘనంగా సన్మానించారు. మండలంలో అన్ని పంచాయతీలకు గ్రామాలకు మంచి ప్రాధాన్యం ఇచ్చి చక్కని అభివృద్ధి చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, డిప్యూటీ ఎంపీడీవోలు వెంకట్రావు, శాంతకుమారి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగాల భరోసా ఏదీ?

### -కూటమి ప్రభుత్వంపై వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ధ్వజం

### -డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్

### -పలాస యువత వలసబాట పట్టాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన

**పలాస, సెప్టెంబరు 23 (వార్త):** దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఆరోపించారు. పలాసలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే గణాంకాలను ప్రస్తావిస్తూ.. 15--29 ఏళ్ల యువతలో నిరుద్యోగ రేటు 9.9 శాతంగా ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని, పట్టణ మహిళల్లో నిరుద్యోగం 18.9 శాతంగా ఉందని వెల్లడించారు.



ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగాల హామీలకు, వాస్తవ పరిస్థితులకు మధ్య భారీ అంతరం కనిపిస్తోందని దుర్యోధనరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు ఉన్నప్పటికీ వాటి భర్తీపై తగిన చర్యలు కనిపించడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలు పెరగడం వల్ల యువతకు ఉద్యోగ భద్రత తగ్గుతోందని ఆరోపించారు. డిగ్రీలు, బీటెక్, ఎంబీఏ వంటి విద్యార్హతలు సాధించినా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు లేక అనేక మంది ఉద్యోగాలు పొందలేకపోతున్నారని తెలిపారు. ఐటీ, తయారీ, స్టార్టప్ రంగాల్లో నియామకాలు తగ్గడం, కొన్ని సంస్థల్లో ఉద్యోగాల కోతలు, రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు తగిన స్థాయిలో లేకపోవడం కూడా ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపుతున్నాయని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు నోటిఫికేషన్ల జాప్యం, పరీక్షల నిర్వహణలో సమస్యలు, కోర్టు వివాదాలు తదితర అంశాలు ఇబ్బందికరంగా మారుతున్నాయని దుర్యోధనరావు అన్నారు. కోచింగ్, వసతి తదితర ఖర్చుల కోసం కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీపై అనుమానాలు ఉన్నాయని, సీబీఐ దర్యాప్తు కోరుతున్నామని, రాష్ట్రంలో నిర్వహించిన మెగా డీఎస్సీపై పలువురు అభ్యర్థులు లేవనెత్తిన సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్షా నిర్వహణ, సర్వర్ సమస్యలు, సాధారణీకరణ ప్రక్రియ, మార్కుల కేటాయింపు తదితర అంశాలపై అభ్యర్థుల్లో అనుమానాలు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటిపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు. పలాస-కాశీబుగ్గ ప్రాంతంలో స్థానికంగా ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని దుర్యోధనరావు తెలిపారు. జీడిపరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, పరిశ్రమలకు అవసరమైన ప్రభుత్వ ప్రోత్సాహం, మార్కెటింగ్ సదుపాయాలు అందకపోతే పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉందన్నారు. స్థానికంగా తగిన ఉపాధి లేక పలాస ప్రాంత యువత హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతోపాటు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వైసీపీ నాయకులు, విద్యార్థి సంఘాలు, సామాజిక మాధ్యమ కార్యకర్తలపై కేసులు, అరెస్టుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయని దుర్యోధనరావు అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సహజమని, విమర్శలను రాజకీయ కక్ష సాధింపు చర్యలతో ఎదుర్కోవడం సరికాదని చెప్పారు.

పలాస ప్రాంత యువత, కార్మికులు, జీడిరైతుల సమస్యలపై మాజీ మంత్రి, పలాస నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ సీదిరి అప్పలరాజు నాయకత్వంలో పోరాటాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించేలా పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## నరసన్నపేటలో ఆయుర్వేద వైద్య శిబిరం

**నరసన్నపేట, సెప్టెంబరు 23 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ ఆవరణలోని విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో బుధవారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. మాకివలస ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలు డాక్టర్ వెలమల సీతా మహాలక్ష్మి శిబిరానికి హాజరైన రోగులను పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా వైద్య సూచనలు చేశారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ పురాతన కాలం నుంచే ఆయుర్వేద వైద్య విధానం ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. ప్రకృతి ఆధారిత చికిత్సా విధానంగా ఆయుర్వేదం సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. ప్రజల్లో ఆయుర్వేదంపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



ఆయుర్వేద వైద్య విధానాన్ని వైద్యుల సూచనల మేరకు సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని ఆమె సూచించారు. శిబిరం ద్వారా స్థానికులకు వైద్య సేవలతో పాటు ఆయుర్వేద చికిత్సపై అవగాహన కల్పించడం జరిగింది.

## వర్షపు నీటితో నరసన్నపేట-కంబకాయ
# రహదారి గోతులమయం

### - మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారిపై భారీగా నీటి నిల్వ

### - గోతులు కనిపించక వాహనదారులకు తప్పని ప్రమాదాల ముప్పు

### - కాలువల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**నరసన్నపేట, సెప్టెంబరు 23 (వార్త):** నరసన్నపేట-



కంబకాయ ప్రధాన రహదారి వరుసగా కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా మారింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారిపై పెద్దఎత్తున వర్షపు నీరు నిలిచిపోవడంతో పలుచోట్ల గోతులు ఏర్పడి రహదారి కాలువను తలపిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీటిలో గోతులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. గోతుల్లో వాహనాలు దిగిపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలు సక్రమంగా లేకపోవడం, కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణలకు గురికావడం వల్ల వర్షపు నీరు సాఫీగా వెళ్లే మార్గం లేక రోడ్డుపైకి చేరుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో సమస్య ఏటా పునరావృతమవుతోందని, తాత్కాలిక మరమ్మతులతో కాకుండా నీటి పారుదల వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే రహదారిని పరిశీలించి గోతులను పూడ్చడంతో పాటు కాలువల్లోని అడ్డంకులు, ఆక్రమణలను తొలగించి వర్షపు నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రహదారి మరమ్మతులు త్వరగా చేపట్టి ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## గోకర్ణపురం కాజ్‌వే వద్ద అప్రమత్తత

### -నీటి ప్రవాహం పెరుగుతుండటంతో అధికారుల క్షేత్రస్థాయి సందర్శన

### - కాజ్‌వేపై రాకపోకలకు అడ్డుకట్ట

**మెళియాపుట్టి, సెప్టెంబరు 23(వార్త):** తుఫాన్ కారణంగా పడుతున్న వర్షాలుతో నదులు, వాగులు తదితర వాటిలో నీటి ప్రవాహం పెరుగుతున్న దృశ్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్, ఇతర అధికారుల సూచనలు సలహాలు పాటించి ఎక్కడ, ఎటువంటి ప్రమాదాలు జరక్కుండా సహకరించాలని ఇన్చార్జ్ తహసిల్దార్ రాము, పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు, స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ సమీర్ అలీ, పంచాయతీరాజ్ డిఈలు తెలిపారు. మెళియాపుట్టి మండలం గోకర్ణపురం గ్రామ పరిధిలో నున్న కాజ్‌వే వద్ద తుఫాన్ కారణంగా నీటి ప్రవాహం పెరుగుతుండటంతో అధికారులు అప్రమతమై బుధవారం నాడు గ్రామాన్ని పాతపట్నం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు ఆధ్వర్యంలో ఎస్ఐ అమీర్ అలీ, ఇంచార్జ్ తహసీల్దార్ రాము, పంచాయతీరాజ్ డీఈలు కాజ్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సలహాలను పాటించి ప్రస్తుతం కాజ్వే పై నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. కాజ్‌వే వద్ద స్టాపర్లు ఏర్పాటు చేసి ప్రజల రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకున్నారు. పోలీస్, రెవెన్యూ సిబ్బందిని అక్కడే ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా కాజ్‌వే వద్ద నీటి ప్రవాహాన్ని లెక్కచేయకుండా దాటేందుకు ప్రయత్నించవద్దని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప రాకపోకలు సాగించకూడదని హెచ్చరించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్శనలో వారితో పాటుగా రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆశాలత, సీనియర్ సహాయకులు జగన్మోహన్రావు, వీఆర్వోలు ఇతర శాఖల సిబ్బంది తదితరులున్నారు.



## వరద ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

### -'అధైర్యపడొద్దు.. అధికారులు అండగా ఉంటారు'

### - మండల ప్రత్యేక అధికారి డాక్టర్ రవికుమార్



**పలాస, సెప్టెంబరు 23 (వార్త):** తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలాస మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మెట్ట రవికుమార్ సూచించారు. లోతట్టు, నీటిముంపు ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, అవసరమైన చోట ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని తెలిపారు. బుధవారం కాశీబుగ్గ డీఎస్పీ టి. భవాని, తహసీల్దార్ బి. శ్రీదేవి, ఎంపీడీవో వసంత్‌కుమార్‌తో కలిసి వరద ప్రభావిత, లోతట్టు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. నీటి ప్రవాహం, ముంపు పరిస్థితులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదు అని, అధికారులు అండగా ఉంటారు అని డాక్టర్ రవికుమార్ భరోసా ఇచ్చారు. వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వరద నీరు ఇళ్లలోకి చేరే పరిస్థితి ఏర్పడితే ప్రజలు ఆందోళన చెందకుండా అధికారుల సహకారం తీసుకోవాలని కోరారు. నీటిముంపు ముప్పు ఉన్న ప్రాంతాల్లో వృద్ధులు, చిన్నారులు, మహిళలు, అనారోగ్యంతో ఉన్నవారికి ప్రాధాన్యమిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. తుఫాన్ ప్రభావం ఉన్న సమయంలో ప్రజలు అనవసరంగా బయటకు రావద్దని, వరద నీటిలో ప్రయాణాలు చేయవద్దని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, ఉధృతంగా ప్రవహించే కాలువలు, వాగుల సమీపానికి వెళ్లవద్దని సూచించారు. ప్రజల భద్రతే అధికార యంత్రాంగం ప్రధాన లక్ష్యమని, అవసరమైన సహాయక చర్యలను సమన్వయంతో కొనసాగిస్తున్నామని డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఈ పర్యటనలో కాశీబుగ్గ డీఎస్పీ టి. భవాని, తహసీల్దార్ బి. శ్రీదేవి, ఎంపీడీవో వసంత్‌కుమార్, కాశీబుగ్గ ఎస్సై దుర్గాప్రసాద్, విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అధికారుల అప్రమత్తత

### -రెండు గెడ్డల వద్ద పోలీసుల భద్రత

### -అధికారులు సుడిగాలి పర్యటనలు

### - ప్రమాదకరంగా మారుతున్న వరద ఉధృతి

**మందస, సెప్టెంబరు 23(వార్త):** అర్నబ్ తుపానుకు అధికారుల అప్రమత్తత కొనసాగుతోంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు అధికారులు మందస మండలంలోని సుడిగాలి పర్యటన చేస్తున్నారు. వర్షాలకు వరద ఉధృతి పెరిగింది. దీంతో గిరిజన గ్రామమైన చీపి సమీపంలో గల చీపిగెడ్డ, బెల్లుపటియా సమీపంలోని మహేంద్రతనయపై కాజ్ వేలపై వరద నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. చీపి గెడ్డ, చీపి గిరిజన ఆశ్రమ పాఠశాల, బెల్లుపటియా కాజ్ వే, సిరిపురం పీహెచ్ సీ పరిధిలోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం తహశీల్దార్ బి.శ్రీహరిబాబు, సైక్లోన్ స్పెషల్ ఆఫీసర్ పి.చంద్రశేఖర్, ఆర్ డబ్ల్యూఎస్ డీఈఈ సూర్యనారాయణ, మందస ఎంపీడీఓ వై.వెంకట రమణ, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, కూటమి నాయ కులు ముంజేటి చంద్రశేఖర్, సంతోష్ కుమార్ పండా పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. గురువారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వరద ఉధృతి పెరగడంతో ముందు జాగ్రత్తగా చీపి గెడ్డ, బెల్లుపటియా కాజ్ వే మార్గాలను ఈ నెల 26 వరకు మూసి వేస్తున్నట్టు తహసీల్దార్ శ్రీహరిబాబు చెప్పారు. తహసీల్దార్ శ్రీహరిబాబు, ఎస్.ఐ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది సిబ్బందిని నియమించారు. ప్రజల రాకపోకలను నిలిపివేసి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని అధికారులు కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




# ఉద్దానం ముద్దుబిడ్డ..
# అభివృద్ధే ఆమె అడ్డా..!

-ప్రజల మెప్పు.. ఉద్యోగుల గుండెల్లో చోటు - జడ్పీ పీఠంపై పిరియా విజయ ప్రస్థానం

-హోదా ఒక బాధ్యతగా.. ఐదేళ్ల సమర్థ పాలనకు విజయవంతమైన వీడ్కోలు

సమర్థతకు పారదర్శకత తోడై.. శ్రీకాకుళం జడ్పీ చరిత్రలో చెరగని ముద్ర




**జిల్లా పరిషత్ చరిత్రలోనే తనకంటూ ఒక ప్రత్యేక పుటను లిఖించుకున్న శ్రీకాకుళం జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఐదేళ్ల సుదీర్ఘమైన, సమర్థవంతమైన పాలనా ప్రస్థానం గురువారంతో విజయవంతంగా పూర్తి కానుంది. 2021 సెప్టెంబరు 25న బాధ్యతలు స్వీకరించిన ఆమె, ఈ నెల 24 నాటికి తన ఐదేళ్ల పదవీ కాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుంటున్నారు. ఆరు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన శ్రీకాకుళం జిల్లా పరిషత్‌లో వెనుకబడిన ఉద్దానం ప్రాంతం (కవిటి) నుంచి పీఠాన్ని అధిరోహించిన తొలి మహిళగా, జడ్పీటీసీగా విజయం సాధించిన తొలిసారే నేరుగా ఈ అత్యున్నత పదవిని చేపట్టిన మహిళా నేతగా ఆమె రికార్డు సృష్టించారు. జిల్లాకు 15వ చైర్‌పర్సన్‌గా, బాధ్యతలు చేపట్టిన మూడో మహిళగా నిలిచిన పిరియా విజయ, ప్రతిపక్షం లేని పాలకవర్గంలోనూ అందరినీ కలుపుకొనిపోతూ సభను ఎంతో హుందాగా, వివాద రహితంగా నడిపించి ప్రజాప్రతినిధులందరి ప్రశంసలు అందుకున్నారు.**





## సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ..

సుదీర్ఘకాలంగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న అర్హులైన ఉద్యోగులకు తగిన గుర్తింపు ఇచ్చారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న వివిధ కేడర్లలోని మొత్తం 126 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. వీటిలో 26 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు, 42 సీనియర్ సహాయకుల పోస్టులు, 3 టైపిస్ట్ పోస్టులు, 18 జూనియర్ సహాయకుల పోస్టులు, 37 రికార్డు/ల్యాబ్ సహాయకుల పోస్టులు ఉన్నాయి. అంతేకాకుండా ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో ఎలాంటి విమర్శలు, అవినీతికి తావులేకుండా అత్యంత పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి అన్ని వర్గాల ఉద్యోగుల అభిమానాన్ని చూరగొన్నారు.



**(శ్రీకాకుళం/కవిటి)**

పిరియా విజయ వెనుక బలమైన రాజకీయ నేపథ్యం ఉంది. వారి కుటుంబం ముందు నుంచి నియోజకవర్గ పరిధిలో ప్రజాసేవలో తనదైన ముద్ర వేయగా, ఆమె భర్త, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నడిపించారు. వారి రాజకీయ అనుభవం, లభించిన ప్రజాదరణ, నిరంతర మార్గదర్శకత్వంలో పిరియా విజయ జెడ్పీ చైర్‌పర్సన్‌గా తన బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలో మంజూరైన 97,000 ఇళ్లలో దాదాపు 90,000 గృహ నిర్మాణాలను పూర్తి చేయించి, రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపడంలో ఆమె చూపిన కృషి అందరి దృష్టినీ ఆకర్షించింది. కుటుంబం నుంచి లభించిన ఆదర్శ ప్రజాసేవ దృక్పథమే ఆమెను విజయవంతమైన పాలకురాలిగా తీర్చిదిద్దింది.

తన ఐదేళ్ల పదవీకాలంలో జిల్లావ్యాప్తంగా అభివృద్ధి పనులను పరుగులు తీయించేందుకు పిరియా విజయ నిధుల కేటాయింపులో ప్రత్యేకంగా చొరవ చూపారు. 15వ ఆర్థిక సంఘం (టైడ్, అన్ టైడ్) నిధుల కింద పాత శ్రీకాకుళం జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో ఉన్న 38 మండలాల పరిధిలో రూ. 31,15.74 లక్షల అంచనా వ్యయంతో మొత్తం 956 పనులను మంజూరు చేసి పూర్తి చేయించారు.

నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. ఆమదాలవలసలో 92 పనులు (రూ. 312.10లక్షలు), ఎచ్చెర్లలో 108 పనులు (రూ.322.80 లక్షలు), ఇచ్ఛాపురంలో 180 పనులు (రూ.594.37 లక్షలు), నరసన్నపేటలో 100 పనులు (రూ.265.45 లక్షలు), పాలకొండలో 107 పనులు (రూ.295.75 లక్షలు), పలాసలో 53 పనులు (రూ. 203.30 లక్షలు), పాతపట్నంలో 92 పనులు (రూ.351.55 లక్షలు), రాజాంలో 83 పనులు (రూ.241.90 లక్షలు), శ్రీకాకుళంలో 33 పనులు (రూ. 184.03 లక్షలు), టెక్కలిలో 108 పనులు (రూ. 344.49 లక్షలు) మంజూరు చేసి గ్రామీణ మౌలిక వసతులను బలోపేతం చేశారు.

కేవలం కేంద్ర నిధులే కాకుండా జిల్లా పరిషత్ సాధారణ నిధులు (23 శాతం జనరల్, 12 శాతం డి.డబ్ల్యూ, 15 శాతం మహిళా శిశు సంక్షేమం, 15 శాతం ఎస్సీ, 6 శాతం ఎస్టీ, 10 శాతం ప్రత్యేక నిధులు, 4 శాతం ఆగంతక నిధులు, 15 శాతం కార్యాలయ నిర్వహణ ఖర్చులు) ద్వారా కూడా పెద్దపీట వేశారు. ఈ సాధారణ నిధుల నుంచి 10 నియోజకవర్గాల వ్యాప్తంగా మరో 966 పనులకు గాను రూ.3455.12 లక్షల నిధులను కేటాయించారు. ఇందులో ఆమదాలవలసకు 75 పనులు (రూ. 382.25 లక్షలు), ఎచ్చర్లకు 97 పనులు (రూ. 312.14 లక్షలు), ఇచ్ఛాపురానికి 208 పనులు (రూ. 778.55 లక్షలు), నరసన్నపేటకు 54 పనులు (రూ. 207.17 లక్షలు), పాలకొండకు 73 పనులు (రూ. 221.50 లక్షలు), పలాసకు 73 పనులు (రూ. 283.48 లక్షలు), పాతపట్నానికి 98 పనులు (రూ. 298.98 లక్షలు), రాజ్జనికి 68 పనులు (రూ. 205.05 లక్షలు), శ్రీకాకుళానికి 138 పనులు (రూ.518.90 లక్షలు), టెక్కలికి 82 పనులు (రూ.247.10 లక్షలు) మంజూరు చేసి గ్రామాల రూపురేఖలు మార్చారు.

హరిత ఇంధన వినియోగం, పర్యావరణ పరిరక్షణలోనూ జడ్పీ కార్యాలయం ఆదర్శంగా నిలిచింది. జిల్లా పరిషత్ ఆవరణలో రూ.15వ ఆర్థిక సంఘ నిధులతో 20 సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. ప్రాంగణంలో ప్రతి నెలా వచ్చే భారీ విద్యుత్ బిల్లుల భారానికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో నూతన సమావేశ మందిరం పైకప్పుపై 60 కిలోవాట్ల గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థను అమర్చారు. దీని ద్వారా ఉచిత పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ జడ్పీ నిధులకు ఆదా మార్గాన్ని చూపి, సమర్థ నిర్వాహకురాలిగా నిలిచారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ సుదీర్ఘకాలంగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న అర్హులైన ఉద్యోగులకు తగిన గుర్తింపు ఇచ్చారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న వివిధ కేడర్లలోని మొత్తం 126 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. వీటిలో 26 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు, 42 సీనియర్ సహాయకుల పోస్టులు, 3 టైపిస్ట్ పోస్టులు, 18 జూనియర్ సహాయకుల పోస్టులు, 37 రికార్డు/ల్యాబ్ సహాయకుల పోస్టులు ఉన్నాయి. అంతేకాకుండా ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో ఎలాంటి విమర్శలు, అవినీతికి తావులేకుండా అత్యంత పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి అన్ని వర్గాల ఉద్యోగుల అభిమానాన్ని చూరగొన్నారు.







**మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో కూడా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు ఆమె పాలనా శైలిని, హుందాతనాన్ని ముక్తకంఠంతో కొనియాడారు. సభను నిష్పాక్షికంగా నడిపించడమే కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారంలో నిధుల మంజూరుకు వెనుకాడలేదని గుర్తుచేసుకున్నారు. అధికార పరిధిని ఒక బాధ్యతగా స్వీకరించి, జిల్లా ప్రజల సేవకే అంకితమైన పిరియా విజయ, గురువారంతో ముగియనున్న తన ఐదేళ్ల పదవీ ప్రస్థానంలో ప్రగతి పథంలో జిల్లాను నిలిపి, అభివృద్ధి ముద్ర వేసి వీడ్కోలు పలుకుతున్నారు.**

## మానవత్వం ఉన్న మహిళగా..
## వందల కుటుంబాలకు ఆసరాగా నిలుస్తూ..

పాలనలో మానవీయ కోణాన్ని ప్రదర్శిస్తూ ఉద్యోగ వర్గాల హృదయాలను గెలుచుకున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మానవీయ కారుణ్య నియామకాలను పారదర్శకంగా భర్తీ చేశారు. మొత్తం 120 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించారు. ఇందులో 28 మంది జూనియర్ సహాయకులు, 16 మంది టైపిస్టులు, 73 మంది ఆఫీస్ సబోర్డినేట్లు, ఒక నైట్ వాచ్‌మన్, ఒక స్వీపర్, ఒక గార్డెనర్ ఉన్నారు. దీనికి తోడు ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భాగం విశేషంగా శ్రద్ధ వహించి ఒక టైపిస్ట్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు నియామక పత్రాలు అందజేసి బాధితుల కుటుంబాల్లో వెలుగులు నింపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.

Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546